క్లుప్తంగా

విజ్ఞాన శిబిరాన్ని వినియోగించుకోండి



మాట్లాడుతున్న సూర్యనారాయణ

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ధర్మవరం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శిమ్మ సూర్యనారాయణ సూచించారు. ధర్మవరం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో సోమవారం పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు పత్రికలు, పుస్తకాలు చదవాలని సూచించారు. భాషా ప్రాధాన్యత పుస్తకాలు, వార్తా పత్రికలు, నీతి కథలు చదవాలన్నారు. ప్రతి ఒక్కరూ లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మలిపెద్ది చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

అందుబాటులోకి పచ్చిరొట్ట విత్తనాలు



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

రణస్థలం: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి డి.విజయ భాస్కర్ తెలియజేశారు. పాతర్లపల్లి రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్ కార్డు పట్టుకుని, సంబంధిత రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. జీలుగు, కట్టె జనుము విత్తనాలు 50 శాతం రాయితీపై అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో ఫ్లాగ్ మార్చ్



ఫ్లాగ్ మార్చ్‌లో ఒకటో పట్టణ పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్: నగరంలో ఒకటో పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సీఐ లెంక సన్యాసినాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది నగరంలోని దమ్మల వీధి, కొత్త దమ్మలవీధి, మండల వీధి ప్రాంతాల్లో శాంతిభద్రతల రక్షణకై ప్రజలు చేయాల్సిన విషయాలను తెలుపుతూ ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎస్సై కామేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం



రమేష్‌కు సాయాన్ని అందజేస్తున్న దాతలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గూనపాలెం ప్రాంతానికి చెందిన రమేష్ మాస్టార్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్మాల్ సర్వీస్ టూ పాసిటివ్ ఫౌండర్ కలివరపు సూర్యప్రకాష్ రూ.55 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని రమేష్‌కు సోమవారం అందజేశారు. రమేష్ ఇంగ్లిష్ లెక్చరర్‌గా పనిచేసి ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దారు. క్యాన్సర్‌తో పోరాడుతూ ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్నారు. కాగా బాలాజీ మెడికల్స్ కిరణ్ తనవంతు సాయంగా సర్జికల్ ఐటమ్స్, మందులను రమేష్‌కు అందించారు. కార్యక్రమంలో పొడుగు చరణ్, మాథ్స్ లెక్చరర్ ఉమామహేష్, ఎస్.పార్దు, ఉర్లాం శివతేజ ఉన్నారు.

'పాడి పరిశ్రమపై అవగాహన అవసరం'



మాట్లాడుతున్న రీసోర్స్ పర్సన్ దిషిత

ఎచ్చెర్ల: విద్యార్థులకు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమపై అవగాహన అవసరమని రీసోర్స్ పర్సన్ బైరి దిషిత అన్నారు. లావేరు శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరంలో పాడి పరిశ్రమ గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మురపాక శ్రీనివాసరావు, సహాయకుడు వీరభద్రుడు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మా.. కాపాడమ్మా..

- ప్రారంభమైన ఉత్సవాలు
- 9 రోజులపాటు పలు ప్రదర్శనలు
- అలరిస్తున్న విద్యుత్ దీపాలంకరణ

శ్రీకాకుళం కల్చరల్:

ముత్యాలమ్మా..కాపాడమ్మా అంటూ భక్తులు వేడుకున్నారు. నగరానికి గ్రామదేవతగా కాకివీధిలో వెలసిన ముత్యాలమ్మతల్లి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారమభమయ్యాయి. తొమ్మిదేళ్ల తరువాత అమ్మవారి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ దమ్మల అర్చకులు, కమిటీ సభ్యులు తెలిపారు. 2015లో అమ్మవారి పండుగ నిర్వహించామన్నారు. ప్రతీ తొమ్మిదేళ్లకొకసారి ఉత్సవాలు సంప్రదయంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రోజూ అమ్మవారికి పసుపు, కుంకుమ పూజలు, ముగ్రాట్లతో చల్లదనం, నైవేద్యాలతో పూజలు ఉంటాయని తెలిపారు. తొలిరోజైన సోమవారం ఉదయం అమ్మవారికి ఉపవాసం చెప్పి పండుగలు ప్రారంభించారు. అనంతరం అమ్మవారి దేవరను భక్తులు వీధులలో మేళతాళాలతో, డప్పుమోతలు, తప్పెటగుళ్ల ప్రదర్శనతో ఊరేగించిన తరువాత దేవరను ఆలయ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్ద ఉంచారు. ఆలయం ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన పెద్ద సెట్టింగు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే వీధుల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ అలరిస్తోంది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.



కళాకారుల డప్పు వాయిద్యాలు



బుట్ట దీపంతో ఊరేగింపు



ముత్యాలమ్మకు ఉపవాసం చెపుతున్న భక్తులు



ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ముఖద్వారం



విద్యుత్ దీపాల అలంకరణలు



తప్పెటగుళ్ల ప్రదర్శన

విజయం వైఎస్సార్‌సీపీదే



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్

- ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధిస్తుందని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయడంతో భారీ మెజారిటీతో గెలవడం తథ్యమన్నారు. ఈ ఎన్నికల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు సైనికుల్లా పని చేశారని అభినందించారు. ఎచ్చెర్ల గెడ్డపై మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేస్తామన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, మండల బూత్ కమిటీ కన్వీనర్ అబోతుల జగన్నాథం, డీసీఎంఎస్ డైరెక్టర్ నక్క ప్రసాదరావు, ఏఎంసీ డైరెక్టర్ బాలి అప్పలసూరి, నడిమివలస సర్పంచ్ బాలి రమేష్‌నాయుడు, ఇస్రో ఫౌండేషన్ నాయకుడు గౌరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ధనుంజయరెడ్డికి జాతీయ పురస్కారం ప్రదానం



ఇచ్ఛాపురం రూరల్: పురస్కారం అందుకుంటున్న ధనుంజయరెడ్డి



నందిగాం: మోహనరావుకు పురస్కారం అందజేస్తున్న సంస్థ సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: వైఎస్సార్‌సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం కార్యదర్శి, ప్రముఖ జానపద కళాకారుడు తిప్పన ధనుంజయరెడ్డి జ్ఞాన బుద్ధ జాతీయ పురస్కారం అందుకున్నారు. ఒంగోలులో ఆదివారం జరిగిన తెలుగు వెలుగు సాహితీ సాంస్కృతిక ఉత్సవాలు–2024 కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందించారు.పాతికేళ్లుగా శాస్త్రీయ సంగీతం, జానపద పండారీ భజన, కోలాటం వంటి రంగాల్లో సేవలకు గానూ ఈ పురస్కారాన్ని అందజేసినట్లు తెలిపారు. పురస్కారం అందుకున్న ధనుంజయరెడ్డికి జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, సర్పంచ్ కారంగి త్రినాథ్‌రెడ్డి అభినందించారు.

మోహనరావుకు కూడా..

నందిగాం: రంగస్థల, పౌరాణిక, భజన కళారంగంలో చేసిన సేవలను గుర్తిస్తూ నరేంద్రపురం గ్రామానికి చెందిన జీరు మోహనరావుకు తెలుగు వెలుగు సాహితీ సాంస్కృతిక సంస్థ జ్ఞాన బుద్ధ పూర్ణ జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఈయనను పలువురు అభినందించారు.

జీడికి మద్దతు ధర కల్పించాలి



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకుడు

కాశీబుగ్గ: జీడిపిక్కలకు మద్దతు ధర కల్పించాలని జీడి రైతుల సంఘట జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్, ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనారి మోహనరావు కోరారు. 80 కిలోల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించి ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాశీబుగ్గలోని సీఐటీయూ కార్యాలయంలో జీడి రైతు కృష్ణారావు అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ఏడాది పంట కాలంలో వర్షాభావ పరిస్థితులతో పంటను రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. జీడి రైతులకు బీమా అమలు చేసి ఆదుకోవాలని కోరారు. సమావేశంలో రైతు సంఘాల ప్రతినిధులు టి.భాస్కరరావు, కె.గురయ్య, అంబటి రామకృష్ణ, సీహెచ్ వేణుగోపాల్, ఎం.బాలానందం, టి.సురేష్, బి.మధు, వై.జోగారావు, అర్జి దానేసు, పి.ప్రకాష్, కె.రాజారావు, ఎన్.గణపతి ఉన్నారు.

జంతు సంక్షేమ నియమావళి పాటించాలి



ఉమామహేశ్వరరావు, అదనపు ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్: బక్రీద్ పండుగను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ హరీష్ గుప్తా ఉత్తర్వుల మేరకు ప్రతీ పౌరుడూ జంతు సంక్షేమ సంస్థ నియమావళి పాటించాలని పోలీసు అధికారులు సూచించారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయం నుంచి సోమవారం పత్రికా ప్రకటన విడుదలైంది. ఈ మేరకు జిల్లా అదనపు ఎస్పీ (క్రైమ్ విభాగం) వి.ఉమామహేశ్వరరావుని నియమావళి అమలుపర్చే జిల్లా నోడల్ అధికారిగా ఎస్పీ జి.ఆర్.రాధిక నియమించారు. జిల్లాలో జంతువుల అక్రమ రవాణాను నియంత్రించేందుకు చెక్‌పోస్టుల వద్ద విస్తృత తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. జంతువులను అక్రమంగా తరలించినా, జంతువధకు సంబంధించి సమాచారం ఉన్నా నోడల్ అధికారి ఫోన్ నెంబరు 6309990803కు తెలియజేయాలన్నారు.

భక్తి శ్రద్ధలతో శివగణార్చన

నందిగాం: మండలంలోని పెద్ద తామరాపల్లిలో సోమవారం భక్తి శ్రద్ధలతో సామూహికంగా శివగణార్చనలు నిర్వహించారు. వీరభద్రస్వామి సంబర మహోత్సవంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పందిరి రాట వేయడం, దేవున్ని దించి విశేష అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం 80 జంటలు దీక్షలు స్వీకరించి మేళతాళాలతో, పాటలతో గణార్చన నిర్వహించారు. సాయంత్రం మహిళలతో కోలాటం, దేవుని తిరువీధి కార్యక్రమం చేపట్టారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు.

ప్రణాళికాబద్ధంగా విద్యాకానుక పంపిణీ

పొందూరు: జగనన్న విద్యా కానుక పంపిణీ ప్రణాళికాబద్ధంగా జరగాలని ఎంఈవోలు పీవీ రామరాజు, పి.రాజారావు, ఎస్ఎస్ఏ సెక్టోరియల్ అధికారి పి.జనార్ధనరావు అన్నారు. మండలంలో విద్యా కానుకల పంపిణీపై సోమవారం ఎమ్మార్సీలో సమీక్ష నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. విద్యా కానుకల పంపిణీలో భాగంగా ఒక్కో విభాగానికి సీఆర్ఎంటీ, పీటీఐ, ఐఈఆర్‌టీతో కూడిన టీమ్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు. టీమ్‌లకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాల పరిశీలన

టెక్కలి: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలతో ఆయా పంచాయతీల్లో ఆదాయ వనరులు సమకూర్చుకోవాలని డీఎల్‌పీవో ఐ.వి.రమణ సూచించారు. టెక్కలి మండలం కె.కొత్తూరు, చాకిపల్లి గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ.. ప్రతీ పంచాయతీలో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వాటిలో పనిచేస్తున్న క్లాప్ మిత్రలంతా సమిష్టిగా పనిచేసి తడి, పొడి చెత్తను వేరు చేయాలన్నారు. ఇక్కడ తయారు చేసిన ఎరువులను రైతులకు అమ్మకాలు చేయాలన్నారు. ఈవోపీఆర్‌డీ బి.మల్లేశ్వరరావు, రిసోర్స్ పర్సన్ పి.ఆనందరావు, పంచాయతీ కార్యదర్శి చంద్రరావు ఉన్నారు.

పోస్టల్ కార్యాలయంలో ఆధార్ సేవలు

టెక్కలి: డివిజన్ కేంద్రమైన టెక్కలిలోని హెడ్ పోస్టల్ కార్యాలయంలో ఆధార్ సేవలు అందుబాటులో ఉన్నట్లు బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ ఎస్.భానోజీరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అలాగే రామజన్మభూమి ఆల్బమ్ సావనీర్ అందుబాటులో ఉన్నట్టు పేర్కొన్నారు. ఈ సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కరుణించిన వరుణుడు



మండువేసవిలో వరుణుడు కరుణించాడు. పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లో సోమవారం సాయంత్రం నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకూ భారీ వర్షం కురిసింది. దీంతో పగలంతా ఎండవేడితో అల్లాడిన ప్రజలకు ఉపశమనం కలిగింది. ఈ వర్షం వేసవి దుక్కులకు అనుకూలమని రైతులు తెలిపారు. కాశీబుగ్గ/వజ్రపుకొత్తూరు రూరల్

సిలబస్ మార్పులపై అవగాహన



మాట్లాడుతున్న ఎంఈవో రాంబాబు

హిరమండలం: ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వం ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉన్నటువంటి టెక్స్ట్ బుక్స్ సిలబస్‌లో కొన్ని మార్పులు చేర్పులను చేపట్టిందని, వాటిపై ఎమ్మార్సీ సిబ్బందితో పాటు ఉపాధ్యాయులకు అవగాహన అవసరమని మండల విద్యాశాఖధికారి కె.రాంబాబు అన్నారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బందితో సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉన్నటువంటి కొన్ని బుక్స్‌లో సిలబస్‌ను సెమిస్టర్ -1, సెమిస్టర్-2 లుగా విభజించారన్నారు. అలాగే సిలబస్‌లో స్వల్ప మార్పులు జరిగాయన్నారు. వాటిని ఉపాధ్యాయులు ముందుగా గమనించాలని సూచించారు. విద్యార్థులకు కొత్త సిలబస్‌లకు అనుగుణంగా టైటిల్స్ ఇవ్వాల్సింటుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యా కానుక డిస్ట్రిబ్యూషన్ సిబ్బంది పాల్గొన్నారు.